ఒక సంఘటన

# కలిసి వచ్చిన జ్యోతిషం

పూ. భా.

టిక్కెట్టు తీసుకుని ప్లాట్‌ఫారం మీదికి వచ్చేసరికి బండీ కదిలి పోతోంది. ఎదురుగా ఉన్న కంపార్టుమెంటులోనికి ఎక్కిపోయాను. ఒక్క అమ్మాయి తప్ప అందులో మరెవరూ లేరు. ముందు బెర్తుమీద ఆవిడ కూర్చుంది. ఎదుటి బెర్తుమీద ఒక సూట్‌కేసు వుంది. సూట్‌కేస్ మీద మిస్. శారద అని చక్కగా పెయింట్ చేసి వుంది.

'ఇది లేడీస్ కంపార్ట్మెంటు ప్లీజ్' అందామె.

'సారీ! క్షమించి నాలుగు స్టేషన్ల వరకూ ఓపికపడితే నా ప్రయాణం కాస్తా పూర్తవుతుంది'.

ఆవిడ ఏమీ సమాధానం చెప్పకుండా ముఖం అటు ప్రక్కకు తిప్పేసుకుంది. అయిష్టతతో కూడుకున్న ఆమె మౌనాన్ని కూడా అర్థాంగీకారంగానే భావించుకుని వెనుక బెర్తు మీదకి పోయాను, మరేమీ అననందుకు ఆమెను అభినందించుకుంటూ.

ఒకే స్త్రీ ఉన్న కంపార్టుమెంటులోనికి ఒకే పురుషుడు ఎక్కితే చాలా ప్రమాదాలున్నాయని చెప్పేవారు. శాస్త్రి కొన్నాళ్లపాటు రైల్వే వాతావరణంలో తిరిగినవాడున్నూ, నాకు అంతరంగిక మిత్రుడున్నూ అవటంచాత అతని మాటలు తు. చా. నమ్మతాను. వెనుకటికి యిలాటి సంఘటనే జరిగిందట. ఒక వేశ్యారత్నం ప్రయాణం చేస్తూన్న కంపార్టుమెంటులోనికి ఒక వైశ్యరత్నం ప్రవేశించాడుట. అంతటితో ఊరుకోకుండా ఆమె చూస్తూండగా తన ధనికత్వాన్ని ప్రదర్శిస్తూ పెట్టెలోంచి కరెన్సీ నోట్లు కట్టలు తీసి లెక్కపెట్టడం మొదలెట్టాడుట' ఇదంతా చూస్తూ ఆ వేశ్యారత్నం గంభీరంగా లేచి నిలబడి నాకొక నోట్లకట్ట యిస్తావా లేక గొలుసు లాగి నన్ను బలాత్కరిస్తున్నట్టు రైల్వే వాళ్ళకూ, పోలీసులకూ తెలియబరచమన్నావా అందిట. తరువాత కథ చాలా ఉంది.

ఇలాటి ప్రమాదాలు ఏమీ లేకుండా ఉండాలని కోరుకుంటూ కూర్చున్నాను, ఆమె నావైపు చూడనైనా చూడనందుకు అభినందించుకుంటూ.

రైలు బాగా వెళుతోంది. ప్రక్క స్టేషన్ వస్తున్నట్టు పెద్దకేక వేసింది. ప్రక్క స్టేషన్‌లో ఎక్కి ఎవరైనా లోపలికి వచ్చేస్తారేమో నన్ను చూసి, అప్పుడు నా వునికికే ప్రమాదం వస్తుందని కంపార్టుమెంటుమీద సుద్దతో వ్రాసివున్న 'లేడీస్ ఓన్లీ'ని చెరపేసి 'రిజర్వ్డు' అని వ్రాసేసాను. నేను వ్రాసింది చూడకుండా ఉండాలని ఆమె యత్నించింది కాని ఆ ప్రయత్నాలు కొద్ది సేపటిలోనే విఫలమయాయి. ఆ తరువాత కూడా ఆమె ఏమీ అనలేదు. బుద్ధిమంతుల లక్షణాలు పూర్తిగా ఉన్నాయనుకున్నాను.

పక్క స్టేషన్ చాలా చిన్నది. అట్టే జనం లేరు బండీ కదులుతూండగా ఎవరో పెద్దమనిషి గభీమని మా పెట్టెలోనికి ఎక్కిపోయాడు.

'ఇది రిజర్వ్డు సార్!' అన్నా.

'నేను మానేవచ్చాను సార్! మీ ఉభయులతోనూ ఒక పావుగంట మాట్లాడదామని'.

మీ ఉభయులు అనటంతో ఆమె చిరాకుగా చూసింది.

'నాతోనా!' అన్నాను.

ఔనన్నట్టు బుర్రఊపి నాప్రక్కను కూర్చుని చంకలోని పుస్తకం పక్కనుపెట్టి జేబులోంచి తీసాడు ఒక అంగుళం ముక్క స్కేలూ, డివైడర్స్, ఒక భూతద్దం, ఒక పెన్సిలూ.

'మీ కుడిచెయ్యి యిలా యివ్వండి.'

'మీరు సాముద్రిక వేత్తలా.'

'మరేం!'

'క్షమించండి నాకు ఆ శాస్త్రంమీద ఏమీ నమ్మకం లేదు.'

'మీలాంటివాళ్ళ దురభిప్రాయాన్ని పోగొట్టడానికే నేను కంకణం కట్టుకున్నాను.'

'మీ ఉద్యమానికి అభివందనాలు. నన్ను మాత్రం.'

'మీరు నాకేం పెద్ద ప్రతిఫలం యివ్వనక్కరలేదు.'

'మీరు ఊరుకుంటేనే ప్రతిఫలం యిచ్చుకుంటాను.'

'పోనీ నేను చెప్పేది వినండి. మీకు కాస్సేపు కాలక్షేపం అయినా అవుతుంది.'

కాలక్షేపానికి ఊఁ అన్నాను. మా గొడవ ఆమె చూసీ చూడనట్టు ఉన్నదేగాని విషయం యందు శ్రద్ధగానే ఉన్నట్టు గ్రహించాను.

చెయ్యి అందించాను. భూతద్దంలో రేఖలన్నీ చూసి, డివైడర్సుతో కొలిచి స్కేలుమీద లెక్క చూసాడు.

'వచ్చే సంవత్సరం యీనెల యీ తారీకు లోగా మీకు పుత్రసంతానం' అన్నాడు.

'జీవితంలో జరిగినవీ, జరుగుతున్నవీ, జరగబోయేవీ ఎన్నో సంఘటనలు ఉంటే ముందుగా సంతాన విషయం ఎత్తుతున్నారేం మహాశయా!'

'ఇదిమాత్రం ముఖ్యవిషయం కాదూ.'

'నిజమే కాని మీరు పప్పులో బాగా కాలు వేశారు.'

'నేనా! సంతానరేఖ అంత ప్రస్ఫుటంగా కనిపిస్తూంటే.'

'శుద్ధ అబద్ధం.'

'ఇదే అబద్ధం అయితే యీ పుస్తకాన్ని వ్రాసినవాడు ఖీరో కాడూ, యీ చెపుతూన్నది పామిస్ట్ శర్మా కాడు.'

'బలే బలే'

ఇంతెందుకూ ఒక్క సంవత్సరం కదా! ప్రత్యక్ష ప్రమాణం మీకే అవుతుంది. యీశర్మ చెప్పిన మాటలు మీరూ మీ భార్యా జ్ఞాపకం ఉంచుకోండి.

నాకు పెద్ద ఆసహ్యం వేసింది. ఆమె ముఖం కోపంతో ఎర్రబారింది.

'మీ సాముద్రిక శాస్త్ర ప్రవీణత్వానికి శతకోటి నమస్కారాలు మహాశయా! లేనిపోని తగువులు కూడా తీసుకు రాకండి. ఆవిడ ఎవరో ఆవిడ మానాన్ని ప్రయాణం చేస్తోంది. నామానాన్ని నేనున్నా!

'అయితే యిద్దరూ కలసి ఒక కంపార్టుమెంటు రిజర్వు చేసుకున్నారన్న మాట'

'షటప్' అన్నాను కోపం పట్టలేక.

పామిస్టు బిక్క చచ్చి ఒక మూలకు పోయాడు. ఏదో పెద్ద నేరం చేసిన వాడల్లే నేనూ బాధ పడుతున్నాను. ఆమె బిక్క ముఖం వేసింది.

అక్కడకుండడం యిక ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ప్రక్క స్టేషన్లో ప్రక్క పెట్టెకు వెళిపోయాను. ఆమె ఎంత బాధపడుతోందో అనే నాఆలోచనతోనే గమ్యస్థానం వచ్చేసింది.

'ఏం శారదా! ప్రొద్దున్న బండీలో రాలేదేం.'

'హల్లో! మూర్తీ! కమాన్! కమాన్! ఈమె మాచెల్లెలు శారద' అన్నాడు మా స్నేహితుడు భూషణం.

'అవునోయ్ భార్యా భర్తలు ఆలోచించుకున్నట్టు ఒక్కసారే దిగారే' అన్నారు భూషణంతో వచ్చిన పెద్దమనిషి.

సంవత్సరం కాకుండానే బారసాల చేసుకుని సకుటుంబంగా రైలు ప్రయాణం చేస్తున్నాం. ఒక స్టేషన్లో పామిస్ట్ శర్మ మా రిజర్వుడు పెట్టె ఎక్కాడు.

'హల్లో! నన్ను మరచిపోయారా. నేను చెప్పింది నిజమైందా.'

'కాకతాళీయంగా.'

'అవును యిప్పుడలాగే అంటారు. ఆవిడ మీ భార్యకాదన్నారే.'

'అప్పటికి కాదు.'

'అరే! యిప్పుడైనా నాఫీజు యిచ్చేయండి.'

